క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజు



నియామక పత్రం అందజేస్తున్న రామచందర్‌రావు

నెల్లికుదురు: బీజేపీ మండల అధ్యక్షుడిగా చందు రాజును ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు బుధవారం తెలిపారు. ఈకార్యక్రమంలో మధన్, సురేందర్‌రెడ్డి, పాపారావు, వెంకన్న, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ

మహబూబాబాద్: జిల్లాలోని ఆహార భద్రతా కార్డుదారులకు ఈనెల 5నుంచి ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీసీఎస్ఓ నర్సింగరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విధుల్లో చేరిన వైద్యులు



కురవి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ ప్రాతిపదికన కేటాయించిన ఇద్దరు డాక్టర్లు విరాజిత, మౌనిక బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ డాక్టర్‌గా పనిచేసిన పృథ్వీ వారిని ఆహ్వానించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు అనురాధ, కవిత, ఫార్మసిస్టు సేవ్యా, సిబ్బంది మల్లేశ్వర రావు, శ్రీధర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు ఫాతిమా హైస్కూల్ రోడ్డు ప్రక్కనే ఉన్న పేదల స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ నాగభవాణి, మున్సిపల్ డీఈ సీహెచ్ ఉపేందర్ ఆ భూమిని పరిశీలించారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



నెల్లికుదురు: ప్రభుత్వం నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా క్వాలిటీ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ప్రత్యేక తరగతుల అమలు తీరును విద్యార్థును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు సద్వినిమోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రాము, హెచ్ఎంలు రాజయ్య, ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు సాయిలు, లక్ష్మ ణ్, శ్రావణి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రవాణా రంగ కార్మికుల పరిస్థితుల్లో మార్పు జరగాలంటే సంక్షేమ బోర్డు ఏర్పాటు ఒక్కటే పరిష్కారమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి వీరయ్య అన్నారు. కార్మికుల సమస్యలపై సంఘర్షయాత్ర పేరుతో జీపు జాతా బుధవారం మానుకోట జిల్లా కేంద్రంలోని జ్యోతి బాసు నగర్ వద్ద చేరుకోగా, ఆటోలు, ట్రాలీలు, కార్లు స్వాగతం పలికారు. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 12 లక్షల మంది రవాణా రంగంలో కార్మికులు ఉన్నారని, వారి గురించి ఏమాత్రం ప్రభుత్వానికి శ్రద్ధ ఉన్న సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు రవాణా రంగంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆర్టీసీ పరిరక్షించాలని, ఆర్టీసీ కార్మికులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ నెల 11వరకు ఈ యాత్ర సంగారెడ్డిలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, నాయకులు కుమ్మరి కుంట్ల నాగన్న, గాడి పెల్లి శ్యామ్, నాగయ్య, ఆజాద్, తోట శ్రీనివాస్, దుర్గారావు, చాంద్, విక్రమ్, లింగయ్య, నాగరాజు, రమేష్, దర్గయ్య, కందనూరి శ్రీనివాస్, పోతుగంటి మల్లయ్య, దాసరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ: రవాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. సంఘర్షన యాత్ర పేరుతో చేపట్టిన జీపు జాతా బుధవారం మరిపెడకు చేరుకుంది. కార్యక్రమంలో సీఐటీయూ, ఇతర సంఘాల నాయకులు కూరపాటి రమేష, సమ్మెట రాజమౌళి, వీరన్న, రాంబాబు, ఉప్పలయ్య, వెంకన్న, లచ్చిరాం, రాజు, తదితరులు పాల్గొన్నారు.



యాత్రలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

కనులపండువగా ఆలయ వార్షికోత్సవం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి గ్రామ శివారు కొండపైగల శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు చివరిరోజు బుధవారం కనుల పండువగా జరిగింది. ఎంపీ మాలోతు కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి హాజరు కాగా, వారందరికి వేద పండితులు శ్రీకాంతశర్మ, రఘురాంశర్మలు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈసందర్భంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్–మంజూల దంపతులచే వేద పండితులు హోమం చేపట్టి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. డోర్నకల్ నియోజక వర్గంలోని పలు గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తగా, భక్తులందరికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ దర్శనానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈవేడుకలకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర, మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రామడుగు అచ్చుత్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.




ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపీ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్, గుడిపుడి నవీన్

‘ఫోన్ హ్యాక్ చేయడం అప్రజాస్వామికం’

మరిపెడ రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తూ బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ హ్యాక్ చేయడం అప్రజాస్వామికమని బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ హ్యాక్, ట్యాప్ చేయడాన్ని నిరసిస్తూ మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్లకార్డులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు పరశురాములు, సువార్త, యాకయ్య, శ్రీను, ప్రభాకరాచారి, నర్సయ్య, ఆదిలక్ష్మి, భిక్షం పాల్గొన్నారు.

మహబూబాబాద్: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ హ్యాక్ చేయడంపై బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.విజయ్‌కాంత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాగన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

అంబులెన్స్ తనిఖీ

గార్ల: గార్లలో 108 అంబులెన్స్ వాహనంను ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంబులెన్స్ వాహనంలో రోగులకు వైద్యసేవలు అందించే సౌకర్యాలను పరిశీలించారు. అంబులెన్స్‌కు ఏమైనా మరమ్మతులు చేయాల్సి వస్తే, వెంటనే జిల్లా కోఆర్డినేటర్‌కు వెంటనే తెలియపర్చాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ వద్ది హరీశ్, ఫీల్డ్ కోఆర్డినేటర్ మహేష్, సిబ్బంది షమీనా, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

గార్ల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి రవీందర్ బుధవారం తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఖానాపురం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ సుభాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలతో పాటు మధ్యాహ్న భోజనం, పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన భోజనం అందించకపోతే విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ మేనక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ సాగుతో అధిక దిగుబడి

ఖానాపురం : యాసంగి సీజన్‌లో రైతులు డ్రమ్‌సీడర్‌తో సాగు చేసుకుంటే అధిక దిగుబడి పొందవచ్చని ఏఓ బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూలీల కొరత, పంట గడువు అంశాలను దృష్టిలో పెట్టుకోని 120నుంచి 125 రోజుల పంట కాలపు విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. డ్రమ్‌సీడర్‌తో పాటు వెదజల్లే పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. వారం నుంచి 10 రోజుల పంటకాల సమయం సైతం ఆదా అవుతుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు ఆధునాతన వ్యవసాయ పద్ధతుల సాగుపై దృష్టిపెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రేషన్ షాపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: తండాలను జీపీలుగా చేసి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని లైన్‌తండాలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. గతంలో లైన్‌తండా ప్రజల ఇబ్బందులను గుర్తించి రేషన్ దుకాణం మంజూరు చేశామన్నారు. ప్రజలు ఈ అవసరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ ఎండి.ఖాసీం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, సురేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడవాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు మహనీయుల బాటలో నడవాలని రోటరీ క్లబ్ మహబూబాబాద్ సీనియర్ సభ్యులు మాల నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడురు ప్రభుత్వ బాలికల పాఠశాలలో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్వామి వివేకానంద విగ్రహాన్ని మాలే నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతం హెచ్ఎం హాలియా నాయక్‌ను క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్ కుమార్, మహిపాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిధర్ గుప్తా, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

నూతన క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



పెద్దవంగరలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెద్దవంగర: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను మండల అధ్యక్ష,కార్యదర్శులు కోట జనార్ధన్, ధర్మారపు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర వెంకన్న హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి ప్రభాకర్, అలువాల అజయ్ కుమార్, గుర్రం శేఖర్, రవి కుమార్, రాయలు, కళ్యాణి, సైదమ్మ, శ్రీలత, శైలజ పాల్గొన్నారు.

వేవ క్యాలెండర్ల ఆవిష్కరణ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వేవ) 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్సై ఎస్కే రియాజ్ పాషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బోగోజు భద్రయ్య చారి, డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఆర్ఐ లస్కర్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీఓ అపర్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జి.వివేక్, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, మారెడ్డి, సంగయ్య, దేవేందర్, అమీనాబీ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

డైరీ ఆవిష్కరణ

మహబూబాబాద్: స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మానుకోట శాఖ కార్యాలయంలో బుధవారం సంఘం డైరీని జిల్లా ఉప ఖజానాధికారి రామకృష్ణ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య, ట్రెజరీ సిబ్బంది వేణు, సంఘం నాయకులు సోమయ్య, మంగపతిరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

దంతాలపల్లి: మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణంలో బుధవారం టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో దంతాలపల్లి నోడల్ అధికారి బుదారపు శ్రీనువాస్ చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ



అందజేసిన ప్లేట్లతో విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని ముపుగల్ ఎంపీపీఎస్ పాటశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు తేలుకుంట్ల సునీత బుధవారం 140 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను బహుకరించారు. భారత దళిత సాహిత్య అకాడమీ వారిచే తేలుకుంట్ల సునీత ఇటీవల జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు అందుకున్నారు. పూలే స్ఫూర్తితో విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం చేయడానికి ప్లేట్లను అందజేశామని ఆమె తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం వీరారెడ్డి మాట్లాడుతూ.. విద్యతోపాటు సామాజిక సేవలు అందిస్తున్న సునీత అభినందనీయురాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, ప్రసాదరావు, ఇద్దయ్య, కుమార్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు



మాట్లాడుతున్న ఏఓ రాకేష్

గూడూరు: మండలంలోని కొల్లాపురంలో బుధవారం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా మొక్కజొన్న పంటలను ఆశించే కత్తెర పురుగు నివారణ, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త క్రాంతికుమార్, ఏఓ రాకేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు మండలాల్లో అధికంగా మొక్కజొన్న పంటలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు తాము పరిశీలించిన పంటలలో కత్తెర పురుగు ఎక్కువగా కనిపించిందన్నారు. మొక్కజొన్నలో ఈ పురుగు జీవిత చక్రం 34 నుంచి 36 రోజులు ఉంటుందని, ఆడ రెక్కల పురుగు సుమారుగా 1500నుంచి 2000 గుడ్లు పెడుతుందని తెలిపారు. కాబట్టి రెక్కల పురుగు నివారణకు పంటలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పప్పు ధాన్యాల పంటలను అంతర పంటగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి సుధాకర్‌రావు, ఏఈఓ పున్నం చందర్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అభివృద్ధికి పూర్తి సహకారం

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులోని కస్తూర్బా పాఠశాల అభివృద్ధికి సీపీఐ అన్ని విధాలా సహకరిస్తుందని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ అన్నారు. పాఠశాలకు సంబంధించిన పలు నిర్మాణాల నిమిత్తం కేటాయించిన స్థలాలను సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి మంద శంకర్, శ్రీనాథ్, సురేష్, మాధవి, రమ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమించాలి

మహబూబాబాద్: సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే లక్ష్యంగా ఎంఎస్పీ ఉద్యమిస్తుందని పార్టీ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. జిల్లా కేంద్రం శివారు మంద కొమురమ్మనగర్ కాలనీతోపాటు పలు కాలనీలలో బుధవారం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజియా, సోమయ్య, మల్లయ్య, రాఘువులు , తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

కురవి: మండలంలోని నేరడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న రాధారపు సునీత సావిత్రిబాయిపూలే రాష్ట్ర స్థాయి అవార్డును మంగళవారం అందుకున్నారు. హైదారాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ చేతులమీదుగా అందుకున్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

కేసముద్రం: తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు భీమిరెడ్డి నర్సింహరెడ్డి శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ఎంసీపీఐ(యు)పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, సలీం, బిచ్చానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠ వ్యాధి స్క్రీనింగ్ క్యాంపు



చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం కుష్ఠ వ్యాధి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాధాకుమారి, మాధవి, తదితరులు ఉన్నారు.

పరామర్శ..

కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ వెడవల్లి వెంకటరెడ్డి సతీమణి వెంకటమ్మ ఇటీవల మృతి చెందటంతో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బుధవారం వెంకటరెడ్డిని పరామర్శించారు.

ఐద్వా మహాసభలు జయప్రదం చేయాలి



గార్ల: కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో ఈనెల 6నుంచి 9 వరకు నిర్వహించే ఐద్వా జాతీయ మహాసభల జయప్రదం కోరుతూ బుధవారం గార్లలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో మహిళలు బెలూన్లు ఎగురవేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, సత్యవతి, మౌనిక, రమ, శోభ, సుజాత, పద్మ, లక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

20వ రోజుకు చేరుకున్న తిరుప్పావై ప్రవచనాలు

మహబూబాబాద్ రూరల్: గోదాదేవి అమ్మవారు భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి తిరుప్పావై ప్రవచనాలతో శ్రీరంగనాథుడికి సేవలు చేసి ఆయనలో ఐక్యమైందని బెంగుళూరుకు చెందిన ప్రముఖ తిరుప్పావై ప్రవచకులు కోయిల్ కందాడై వెంకటరామాచార్యులు అన్నారు. జిల్లా కేంద్రంలో వేణుగోపాలస్వామివారి దేవాలయంలో కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచన పఠనం కార్యక్రమంలో భాగంగా బుధవారం వెంకటరామచార్యులు ప్రవచనాలపై వివరించారు. 20వ రోజుకు చేరుకున్న పాశురం ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ.. భక్తులు శ్రీమన్నారాయణుడిని నమ్మి కొలుస్తున్నారని వారిలోని దోషాలను, పాపాలను తొలగించి అమృతతుల్యమైన ఆనంద సంపదను, మోక్షాన్ని ప్రసాదించాలని విజ్ఞప్తి చేశారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు
క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎంపీ కవిత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. డోర్నకల్ మండలంలోని పెరుమాండ్ల సంకీస గ్రామానికి చెందిన కన్నెబోయిన రమేష్ ద్విచక్ర వాహనంపై కురవి నుంచి మహబూబాబాద్ వైపునకు వెళ్తున్న క్రమంలో బేతోలు గ్రామానికి చెందిన మల్సూర్ రోడ్డు దాటుతుండగా రమేష్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆ సమయంలో మరిపెడకు వెళ్తున్న ఎంపీ కవిత గమనించి వెంటనే కారు ఆపి గాయపడిన క్షతగాత్రులను పోలీసు ఎస్కార్ట్ వాహనంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మల్సూర్ తలకు తీవ్ర గాయమై ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు.

ట్రాలీ ఆటో పల్టీ.. కూలీలకు తీవ్రగాయాలు



గాయపడిన దేవానంద్



గాయపడిన మీనా

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట జాతీయ రహదారిపై కూలీలతో వస్తున్న టాటా ఏస్ ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ అయి ప్రమాదానికి గురై పలువురు కూలీలకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన కూలీలు 26మంది ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట పరిసర ప్రాంతాల్లో మిర్చి పంట సేకరించే కూలీ పనులకు పాకలు వేసుకుని ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం వారంతా టాటా ఏస్ ట్రాలీ ఆటోలో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారిగూడెంకు బయలుదేరి వెళ్తున్నారు. మర్రిమిట్ట వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ అయి పల్టీ కొడుతూ పక్కనే గుంతలలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో దేవానంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయాలు కాగా, మీనా అనే యువతి కాలు విరిగింది. మిగతా 24 మంది కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే వారందరినీ అంబులెన్స్, ఇతర వాహనాల్లో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పొలంలోకి దూసుకెళ్లిన ట్రాలీ..

దంతాలపల్లి: మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సూర్యాపేటకు చెందిన ట్రాలీ ఆటో మంగళవారం రాత్రి పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు గ్రామంలో సంతకు వచ్చి పండ్లు అమ్ముకొని తిరిగి సూర్యాపేటకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పొలంలోకి దూసుకెళ్లినట్లు తెలిపాడు. ఎలాంటి ప్రమాదం జరగలేదన్నాడు.

నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?
ఎస్ఎన్‌సీయూ ద్వారం అద్దం పగిలినా పట్టించుకోని వైనం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో గల శిశు సంజీవని ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రంలోనికి వెళ్లే మార్గం ప్రధాన ద్వారం అద్దం పగిలి చాలా నెలలు అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటంలేదు. ఒక ద్వారం అద్దం పగిలి ముక్కలు ఊడి పోయి సగం మిగిలి ఉండగా దానికి అతుకులు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రతి రోజు ఎంతో మంది తల్లులు, పిల్లల సంరక్షకులు చిన్నారులను చూసేందుకు వచ్చి వెళ్తుంటారు. అయినాసరే పగిలిన అద్దాల ప్రాంతంలో కొత్త అద్దాలు బిగించలేదు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రి సందర్శనకు వచ్చిన సమయంలో కూడా ఆ ద్వారాలు పగిలిన అద్దాలపై దృష్టి పడకుండా సంబంధిత అధికారులు జాగ్రత్తపడ్డారు.